క్లుప్తంగా

యూనిఫాంల పంపిణీ



మున్సిపల్ కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న రోజారాణి, మంగతయారు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ మంగతయారు చేతుల మీదుగా యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవల మూలంగానే మున్సిపాలిటీలోని కాలనీలు పరిశుభ్రంగా ఉంటున్నాయని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు పాలీహౌస్ ధ్వంసం



ఈదురు గాలులతో ధ్వంసమైన పాలీహౌస్ రేకులు

హత్నూర(సంగారెడ్డి): ఈదురు గాలులకు పాలీహౌస్ ధ్వంసమైంది. ఈ ఘటన మండల పరిధిలోని కొన్యాల గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బడంపేట మల్లయ్య తన వ్యవసాయ పొలంలో ఉన్న పాలీహౌస్ గాలివానకు పూర్తిగా ధ్వంసం కావడంతో రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. దీంతో ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు మల్లయ్య వేడుకున్నాడు. కొన్ని గ్రామాల్లో భారీ చెట్లు సైతం నెలకూలాయి.

మై ఆటో ఈజ్ సేఫ్ కార్యక్రమం ప్రారంభం



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అరుణ్‌కుమార్

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలో మై ఆటో ఈజ్ సేఫ్ కార్యక్రమాన్ని ఎస్‌ఐ అరుణ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఆటో చోదకులపై భరోసా కల్పించేందుకే పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఆటోకు గుర్తింపు సంఖ్య కేటాయించడంతో పాటు డయల్ 100, పోలీస్‌శాఖ ఫోన్‌నంబరుతో క్యూఆర్ కోడ్ స్టిక్కర్‌ను ఆటోకు అతికించినట్లు వివరించారు. ప్రయాణికులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే లింక్ వస్తుందన్నారు. దీని ద్వారా ఫిర్యాదులు చేయవచ్చునని సూచించారు. ఆప్షన్ క్లిక్ చేస్తే డయల్ 100 లేదంటే జిల్లా పోలీసు శాఖకు సమాచారం వెంటనే చేరుతుందన్నారు. దీని ద్వారా తక్షణ సహాయం పొందవచ్చునని సూచించారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆటో వివరాలు పూర్తిగా తెలుస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ గౌస్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి



వర్షం నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వర్షాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేటర్ పుష్ప అధికారులకు సూచించారు. రామచంద్రాపురం పట్టణంలో జాతీయ రహదారిపై వర్షం నీరు నిలవడంతో శుక్రవారం పరిశీలించి జేసీబీతో ఆ నీటిని కాలువలోకి మళ్లించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో రోడ్లపై నీరు నిలువకుండా ఎప్పటికప్పుడు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

11న సర్వసభ్య సమావేశం

నారాయణఖేడ్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు ఎంపీపీ కర్ర చాందీబాయి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

రహదారులు అధ్వానం

జిన్నారం(పటాన్‌చెరు): చిన్నపాటి వర్షాలకే రోడ్లు చిత్తడవుతున్నాయి. ఏళ్ల కాలంగా కొనసాగుతున్న మిషన్ భగీరథ పనులతో రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడంలేదని మున్సిపాలిటీ ప్రజలు వాపోతున్నారు.

– జిన్నారం(పటాన్‌చెరు)

- చిన్నపాటి వర్షాలకే చిత్తడవుతున్న రోడ్లు
- భగీరథ పనులతో మరింత అధ్వానం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



ఖాజీపల్లి–బొల్లారం గ్రామాల మధ్య రింగురోడ్డు సమీపంలో నిలిచిన మురుగునీరు

మండల పరిధిలోని బొల్లారం మున్సిపాలిటీలో సుమారు 50వేల జనాభా ఉంటుంది. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఉండటంతో దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివాసం ఉంటున్నారు. మున్సిపాలిటీ 22 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల్లో మూడేళ్ల నుంచి రోడ్ల పక్కల నుంచి గుంతలు తీస్తూ మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు చేపడతున్నారు. అయితే పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. బొల్లారంలోని మిషన్‌భగీరథ ట్యాంకు నుంచి పాత మున్సిపల్ కార్యాలయం వరకు ఉన్న ప్రధాన రోడ్డు పూరిగా గుంతలమయంగా మారడంతో మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన బొల్లారంలోని ప్రధాన రోడ్డు

గుంతలమయంగా ఖాజీపల్లి రహదారి

మండల పరిధిలోని ఖాజీపల్లి–బొల్లారం గ్రామాల మధ్య ఉన్న రింగురోడ్డు సమీపంలో చిన్నపాటి వర్షానికే తరచూ నీరు నిల్వ ఉంటోంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మూడేళ్ల నుంచి ఈ పరిస్థితి కనబడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని వాహనదారులు వాపోతున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు పడితే ఈ సమస్య తీవ్రంగా ఉంటుందని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహనదారులు వేడుకుంటున్నారు.

> **పనులు పూర్తయ్యేలా చూస్తున్నాం**
>
> మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ పనులు కొనసాగుతుండటం వల్ల రోడ్లకు మరమ్మతులు చేపట్టడంలో ఆలస్యం జరుగుతోంది. పనులు పూర్తయిన వెంటనే మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్లకు మరమ్మతులు చేపట్టి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం
>
> – మంగతాయారు, మున్సిపల్ కమిషనర్, బొల్లారం

సీఎంను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా విజయం సాధించిన సురేష్‌షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో 20వేల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించడం పట్ల వారిని సీఎం అభినందించారు. పార్టీ బలోపేతం కోసం మరింత కష్టపడాలని సూచించారు. వారి వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

పరీక్షా కేంద్రం పరిశీలన



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ నాగరాజు

పటాన్‌చెరు టౌన్: ఈ నెల 9వ తేదీ గ్రూప్–1 పరీక్ష నేపథ్యంలో అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడలోని ఎల్లంకి కళాశాల పరీక్షా కేంద్రాన్ని సీఐ నాగరాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను ఎగ్జామ్ హాల్‌లోనికి అభ్యర్థులను అనుమతిస్తారన్నారు. 10 గంటలకు పరీక్ష కేంద్రం గేట్ మూసివేయనున్నట్లు తెలిపారు. 10 గంటల తర్వాత వచ్చిన వారిని లోపలికి అనుమతించబోమన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఈ పరీక్షా కేంద్రంలో 840 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

జోరందుకున్న వ్యవసాయ పనులు



చేర్యాల శివారులో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

కంది(సంగారెడ్డి): వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు బుధవారం కురిసిన వర్షానికి పత్తి విత్తనాలు విత్తే పనుల్లో బీజీ అయ్యారు. రేపటి నుంచి మృగశిర కార్తె ప్రారంభం కానునుండడంతో మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

- జెడ్పీటీసీ రమేశ్
- సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ బాలయ్య

జోగిపేట(అందోల్): గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని అందోలు మండల జెడ్పీటీసీ రమేశ్ అన్నారు. ఎంపీపీ బాలయ్య అధ్యక్షతన శుక్రవారం సర్వసభ సమావేశాన్ని నిర్వహించారు. మన ఊరు.. మన బడి కార్యక్రమం ద్వారా చాలా పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టగా ఇప్పటివరకూ బిల్లులు రాలేదని జెడ్పీటీసీ రమేశ్ సమావేశం దృష్టికి తీసుకురాగా స్పందించిన పీఆర్ కృష్ణ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించేవిధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ కృష్ణ సూచించారు. అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ ఏఓ విజయరత్న సూచించారు. విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని, నేరడిగుంట గ్రామానికి బస్సు సౌకర్యం విషయంలో ప్రతి సమావేశంలో చెబుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడంలేదని ఎంపీటీసీ కృష్ణగౌడ్ వాపోయారు. బైపాస్‌రోడ్డులో ఉన్న హాస్టల్‌కు వెళ్లే దారిలో వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు హాస్టల్‌లో ప్రతి నెల ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని వార్డెన్ నర్సింహులు కోరారు. సమావేశంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సత్యనారాయణ, మండల స్పెషల్ ఆఫీసర్ గీత, ఎక్సైజ్ సిబ్బంది, డిప్యూటీ తహసీల్దారు మధుకర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ఏడీఏ అరుణ, కార్యాలయ సూపరింటిండెంట్ అశోక్, ఐకేపీ ఏపీఎం మాణిక్యం, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

పుల్కల్(అందోల్): మండల కేంద్రం పుల్కల్ శ్మశానవాటిక వద్ద గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతి చెందిన మహిళ మూడు నెలలుగా సమీప గ్రామాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. శ్మశానవాటిక వద్ద మృతి చెందడంతో పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి పుల్‌కల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ పేర్కొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నా యని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 30వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు.

హరీశ్‌రావును విమర్శించడం సరికాదు

శివ్వంపేట(నర్సాపూర్): సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుని కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హన్మంత్‌రావు విమర్శించడంపై బీఆర్‌ఎస్ నాయకులు ఖండించారు. మండల పరిధిలోని గూడూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులుయాదగిరి, హన్మంతు, బ్యాగరి యాదగిరి మాట్లాడుతూ.. మైనంపల్లి రాష్ట్రంలోని పలుచోట్ల భూములు కబ్జాలకు పాల్పడిన సంగతి అందరికి తెలిసిందేన్నారు. ప్రజాసేవలో ఉన్న హరీశ్‌రావుని విమర్శించడం మంచిదికాదన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.22.50 లక్షలు

- అంత్యక్రియలకు మరో రూ.లక్ష
- సంగమేశ్వర్ మృతికి వోక్స్ యూనివర్సిటీ యాజమాన్యం బాధ్యత



ఒప్పంద పత్రం ఇస్తున్న వోక్స్ యాజమాన్యం

మునిపల్లి(అందోల్): సైదాపూర్ గ్రామానికి చెందిన మృతుడు దోషాడ సంగమేశ్వర్ సంగమేశ్వర్ కుటుంబానికి రూ.22.50 లక్షలు, అంత్యక్రియలకు మరో రూ.లక్ష ఇవ్వడానికి శుక్రవారం వోక్స్ యూనివర్సిటీ యజమాన్యం రాతపూర్వకంగా ఒప్పంద పత్రం ఇచ్చింది. శుక్రవారం మండలంలోని కంకోల్ వోక్స్ యూనివర్సిటీలో యాజమాన్యం, అధికార పార్టీ, అఖిల పక్ష నాయకులు, మృతుడి కుటుంబ సభ్యులు చర్చలు జరిపారు. వివరాల్లోకి వెళ్తే.. కొండాపూర్ మండలం సైదాపూర్ గ్రామానికి చెందిన దోషాడ సంగమేశ్వర్ (37), భార్య జ్యోతితో కలిసి మునిపల్లి మండలం వోక్స్ యూనివర్సిటీలో గాడ్ వర్కర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 2వ తేదీ ఆదివారం ఎప్పటిలాగే విధులకు వెళ్లారు. సంగమేశ్వర్ తిరిగి ఇంటికి రాకపోవడంతో 3వ తేదీ సంగమేశ్వర్ కుటుంబ సభ్యులు యూనివర్సిటీ ఎదుట ఆందోళన చేశారు. రెండు రోజులైనా సంగమేశ్వర్ జాడ దొరక్కపోవడంతో ఆందోళన ఉధృతం చేశారు. 6వ తేదీన డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీ చేస్తున్న క్రమంలో సదాశివపేట మండలం కోనాపూర్ గ్రామ శివారులోని ఓ వెంచర్ సమీపంలో కాల్వలో మృతదేహమై కనిపించాడు. మృతికి వోక్స్ యూనివర్సిటీ బాధ్యత వహించి అధికార పార్టీ, అఖిల పక్ష నాయకులతో చర్చలు జరిపారు. రూ.23.50 లక్షలు ఇస్తామని ఒప్పందం రాసుకున్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీశ్ కుమార్, సీపీఎం నాయకులు జయరాజ్, రమేశ్ గౌడ్, చాంద్‌పాషా, బీఆర్‌ఎస్ నాయకులు మల్లాగౌడ్‌తోపాటు జ్యోతి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులు వయసుకు తగ్గట్టు బరువు ఉండాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిన్నారులు వయసుకు తగిన ఎత్తు, బరువు ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. శుక్రవారం మండలంలోని శేరికుంట తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో బడిబాటలో భాగంగా మూడేళ్లు పూర్తయిన చిన్నారులను అంగన్‌వాడీ చేర్పించాలంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోషిమాత మాట్లాడుతూ.. తల్లులు తమ పిల్లలను ఎదుగుదల ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కుదిరిన వేతన ఒప్పందం

జహీరాబాద్ టౌన్: కోహీర్ మండలంలోని గ్లోబల్ గ్రీన్ కంపెనీలో కార్మికుల వేతన ఒప్పందం కుదిరినట్లు యూనియన్ అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. గ్లోబల్ గ్రీన్ కంపెనీ యాజమాన్యంతో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శుక్రవారం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ గతంలో కుదిరిన ఒప్పందం కాలపరిమితి ముగియడంతో వేతనాలు పెంచాలని డిమాండ్ చేశామన్నారు. చర్చల తరువాత ప్రతి కార్మికుడికి రూ.8300 వేతనం పెరిగిందని తెలిపారు. 260 రోజుల పనిదినాలు పూర్తి చేస్తే అదనంగా 2 అలవెన్స్‌లు ఇస్తారన్నారు. ఈ అగ్రిమెంట్ మూడేళ్ల వరకు ఉంటుందని వివరించారు. వేతనం ఒప్పందం చర్చల్లో యాజమాన్యం తరపున కంపెనీ అధికారులు జేఎస్ రావు, సంగోట భట్టాచార్య, రమేష్, వెంకటేశం, యూనియన్ నాయకులు మల్లేశం, వీర్‌శెట్టి, లక్ష్మినారాయణ, రవీంద్రనాథ్ పాల్గొన్నారు. అనంతరం యూనియన్ నాయకులు అధికారులను ఘనంగా సన్మానించారు.



అధికారులను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి వినోద్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులు వ్యవసాయ అధికారి వినోద్ ఆధ్వర్యంలో పట్టణంలోని మల్లికార్జున, నవాబ్ ఆగ్రో ఏజెన్సీ, అగ్రిమార్ట్ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల నిలువల వివరాలను ప్రతి రోజు స్టాక్ బుక్‌లో రాయాలని డీలర్లకు సూచించారు. అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు సరిపడ ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం కంది, పెసర, మినుము, సోయబిన్ విత్తనాలు ఉన్నాయని పేర్కొన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పకుండా రశీదులు తీసుకోవాలని సూచించారు.

భగీరథ నీటి వసతిపై సర్వే

చిలప్‌చెడ్(నర్సాపూర్): మిషన్ భగీరథ నీటి సౌకర్యాలపై ఇంటింటి సర్వే నిర్వహించాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. శుక్రవారం ఆయన ఈ విషయమై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతీ ఇంటిలో ఉన్న కుటుంబసభ్యుల వివరాలు, ఇంటి యజమాని ఫొటోతో పాటు భగీరథ నల్లా ఫొటో తీసుకోవాలన్నారు. భగీరథ నీళ్లు సక్రమంగా వస్తున్నాయో, లేదో కనుక్కోవడంతో పాటు, వచ్చే నీళ్లు సరిపోతున్నాయో, లేదో తెలుసుకొని భగీరథ యాప్‌లో ఎంటర్ చేయాలన్నారు. ప్రజలకు భగీరథ నీరు అందించడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ నెల 10 నుంచి పది రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వే పూర్తి చేయాలని సూచించారు.

నిలువ నీడ కరువు

- శిథిలావస్థకు చేరిన బస్‌షెల్టర్లు
- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోని వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రయాణికుల కోసం నిర్మించిన బస్‌షెల్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్ని ప్రమాదకరంగా తయారయ్యాయి. దెబ్బతిన్న బస్‌షెల్టర్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. దీంతో ఎండకు, వానకు తడుస్తూ ప్రయాణికులు ఆటోల కోసం రోడ్డుపైనే నిల్చొని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. పలుమార్లు బస్‌షెల్టర్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

– జహీరాబాద్ టౌన్

జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో దశాబ్దాల క్రితం బస్‌షెల్టర్లు నిర్మించారు. దీంతో ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు వచ్చిపోయే సందర్భాల్లో బస్‌షెల్టర్లలో తలదాల్చుకునేవారు. ఈ క్రమంలో బస్సుషెల్టర్లు పూర్తిగా దెబ్బతినగా మరమ్మతులు చేపట్టకపోవడంతో చాలావరకు శిథిలమవగా చాలాచోట్ల అలంకారప్రాయంగా మారాయి. మొగుడంపల్లి మండల పరిధిలోని రాయిపల్లి(డి) తండా చౌరస్తాలో నిర్మించిన బస్‌షెల్టర్ గిరిజనులకు ఎంతగానో ఉపయోగపడింది. ఐదారు సంవత్సరాల క్రితం ఓ లారీ అదుపుతప్పి బస్‌షెల్టర్‌ను ఢీకొట్టగా గోడకూలి పూర్తిగా దెబ్బతింది. అప్పటి నుంచి మరమ్మతులు నోచుకోకపోవడంతో బస్టాండ్ నిరుపయోగంగా మారింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు తప్పడంలేదు.

కూలిపోయే దశలో బస్‌షెల్టర్లు

మండల పరిధిలోని చిరాగ్‌పల్లి, కొత్తూర్(బి), అల్గోల్, హోతి(కె), మాడ్గి చౌరస్తా తదితర ప్రాంతాల్లో నిర్మించిన బస్‌షెల్టర్లు పూర్తిగా దెబ్బతిని కూలిపోయే స్థితిలో ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రయాణికులు నిలువ నీడ కరువై రోడ్లపైనే నిల్చొని బస్సులు, ఆటోల కోసం రోడ్డుపై ఎదురుచూస్తున్న పరిస్థితి ఉంది. ఆర్టీసీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి శిథిలావస్థకు చేరిన బస్‌షెల్టర్లను తొలగించి నూతనంగా నిర్మించాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా ఉన్నత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ధ్వంసమైన రాయిపల్లి(డి) బస్‌షెల్టర్

> **మరమ్మతులు చేపట్టాలి**
>
> రాయిపల్లి(డి) చౌరస్తాలో నిర్మించిన బస్‌షెల్టర్ తండా వాసులకు నీడనిచ్చేది. కొన్ని సంవత్సరాల క్రితం బస్సుషెల్టర్‌ను లారీ గుద్దడంతో దెబ్బతింది. ఈ విషయాన్ని మండల సర్వసభ్య సమావేశాల్లో పలుమార్లు అధికారుల దృష్టికి పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా దెబ్బతిన్న బస్‌షెల్టర్లకు మరమ్మతులు చేపట్టాలి.
>
> కీరుచౌవాన్, మాజీ సర్పంచ్, రాయిపల్లి(డి)తండా